ప్రజాశక్తి
శనివారం 21 సెప్టెంబర్ 2024



587 సెల్‌ఫోన్లు రికవరీ

- వాటి విలువ రూ.1.33 కోట్లు
- 'మొబైల్ రికవరీ మేళా'లో జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

జిల్లాలో పోగొట్టుకున్న 587 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని ఎస్‌పి జి.బిందు మాధవ్ అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మొబైల్ ఫోన్ రికవరీ మేళాలో బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు. ఎస్‌పి మాట్లాడుతూ మొబైల్ ఫోన్ జీవితంలో ఒక భాగమైందని, మొబైల్స్ పోగోట్టుకుంటే కలిగే బాధ, ఆవేదన ఏంటో అందరికీ తెలుసని అన్నారు. మొబైల్‌లోని పర్సనల్ వివరాలు, ఫొటోలు, ఫోన్ నెంబర్లు, వ్యాపార లావాదేవీలు, ఆన్‌లైన్ బ్యాంకు ఖాతా వ్యవహారాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఈ ఆవేదనను దృష్టిలో ఉంచుకుని మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నామన్నారు. మొబైల్ రికవరీ ప్రక్రియ ఈ కింది విధంగా అనుసరించాలని చెప్పారు. మొబైల్ పోగోట్టుకున్న బాధితుడు http://Kurnoolpolice.in/mobiletheft లింకును క్లిక్ చేసి మొబైల్‌కు సంబంధించిన వివరాలను తెలపాలన్నారు. కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు వాటిని తీసుకుని ట్రాక్ చేస్తారన్నారు. మొబైల్ ఫోన్ పోయినప్పుడు క్షేత్రస్థాయి నుండి కింది స్థాయి సిబ్బంది వరకు ఫీల్డ్ లో ఉండి ఎంతో కష్టపడి పని చేస్తేనే ఈ ఫలితం వస్తుందని చెప్పారు. మొదటి విడతలో 587 (విలువ రూ.1,33,70,000)మొబైల్ ఫోన్లను రికవరీకి కృషి చేసిన ప్రతి పోలీసును ప్రత్యేకంగా సైబర్ ల్యాబ్ పోలీసులను అభినందిస్తున్నామని తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరి చేసి బాధితులకు అందజేశామని అన్నారు. మొబైల్ ఫోన్లను రికవరీ చేయడంలో కర్నూలు పోలీసులు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మొబైల్ ఫోన్ పోగోట్టుకున్న బాధితుడు మొదటగా LOST MOBILE TRACKING SERVICE LINKను తెరచి kurnoolpolice.in/mobiletheft ఈ లింకు ను క్లిక్ చేసి ఆ వివరాలను తెలియజేస్తే మీ మొబైలును తిరిగి పొందవచ్చునని అన్నారు. ఇచ్చిన లింక్ ను క్లిక్ చేసి మొబైల్ LOSTకాలమ్ నందు మీ పేరు, మీ జిల్లా ,మీ పోలీస్ స్టేషన్‌పరిధి, మీ మొబైలుకు సంబంధించిన వివరాలు, మీరు ప్రస్తుతం ఉపయోగిస్తున్న మొబైలు నంబర్ alternate కాంటాక్ట్ వివరాలు సద్మిట్ చేయాలన్నారు. సంబంధించిన లోకల్ పోలీసులకు సమాచారం ఇస్తూ బాధితుడు పోగోట్టుకున్న ఫోన్ల ను రికవరీ చేస్తున్నారన్నారు. బాధితులు తమకు దగ్గర్లోని మీ సేవా కేంద్రాలకు వెళ్ళి ఈ కింది వివరాలు అందించినట్లయితే మీ మొబైల్‌ను పోలీసు వారు తిరిగి ఇప్పించటం కోసం మీరు పోగొట్టుకున్న ప్రదేశం, తేదీ వివరాలు, మీరు పోగొట్టుకున్న మొబైలుసెల్ ఫోన్ యొక్క IMEI వివరాలు, మీరు పోగొట్టుకున్నప్పుడు ఉపయోగించిన మొబైలు నెంబర్ వివరాలు, మీకు సంబంధించిన వ్యక్తిగత గుర్తింపు కార్డ్ , చిరునామా, పేరు మొదలగు వివరాలు మిమ్మల్ని సంప్రదించడానికి మీరు ప్రస్తుతం ఉపయోగిస్తున్న మొబైలు నెంబర్, ప్రత్యామ్నాయ మొబైల్ నెంబరు వివరాలు తెలుపుతామన్నారు. ఈ వివరాలు మీరు మీ–సేవా నందు సమర్పించి Missing lost articles రుసుంను చెల్లించి, సదరు మీ–సేవా రసీదును తమ పరిధిలోని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలని చెప్పారు. కేంద్రప్రభుత్వం కూడా CEIR (Central Equipment Identity Register) పోర్టల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. మొబైల్ పోయిన తర్వాత బాధపడడం కంటే ఆ మొబైల్ ఫోన్ పోగొట్టుకోకుండా జాగ్రత్తలు పాటించడం మంచిదని జిల్లా ఎస్‌పి జి. బింధు మాధవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న ఎస్‌పి బిందు మాధవ్

భద్రత లేని బతుకులు

- క్రమబద్ధీకరణకు నోచని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు - అందని కనీస వేతనం, పలు సౌకర్యాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

ప్రతి ఇంటిలో విద్యుత్ ఉండాలంటే విద్యుత్ శాఖలో పని చేసే కార్మికులే కీలకం. వారిలో ఎక్కువ మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న వారే ఉన్నారు. ఏళ్లుగా క్రమబద్ధీకరణకు నోచుకోవడం లేదు. కనీస వేతనం, పలు సౌకర్యాలు కూడా అందడం లేదు. భద్రత లేని బతుకులు సాగిస్తున్నారు...



విద్యుత్ శాఖలో ఉమ్మడి కర్నూలు జిల్లా (కర్నూలు ఆపరేషన్ సర్కిల్)లో 257 విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. వాటి పరిధిలో 1726 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారు. వివిధ విభాగాల్లో పోల్ టు పోల్ వర్కర్లు, మీటర్ రీడర్లు, షిఫ్టు ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్, సెంట్రల్ బ్రేక్ డౌన్ గ్యాంగ్ మెన్, కంప్యూటర్ ఆపరేటర్లు, టైపిస్టు, డ్రైవర్లు, హౌస్ కీపింగ్ కార్మికులు, బిల్ కలెక్టర్లు, బిల్లింగ్ క్లర్కులుగా పని చేస్తున్నారు. హై స్కిల్డ్, స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఏళ్ల కాలంగా పని చేస్తున్నా వారు క్రమబద్ధీకరణకు (రెగ్యులర్ చేసేందుకు) నోచుకోవడం లేదు. 2014 ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాకా పట్టించుకోలేదు. 2019 ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి కూడా రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారు. తరువాత అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన ప్రభుత్వం కూడా రెగ్యులర్ చేయలేదు. దీంతో పాలకులు మారుతున్నా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు క్రమబద్ధీకరణకు నోచుకోవడం లేదు. వైసిపి ప్రభుత్వం ఇవ్వాల్సిన అరియర్స్ ఇవ్వలేదు. దాదాపు ఒక్కో కార్మికునికి రూ.1.20 లక్షల వరకూ రావాల్సి ఉంది. ఒకే పని చేస్తున్న పాత వారికి, కొత్త కార్మికులకు సమానమైన వేతనాన్ని అమలు చేయడం లేదు. సబ్ స్టేషన్లలో పని చేసే వాచ్‌మెన్లను ఇతర పనులకు వాడుకుంటుండటం తో రాత్రి పూట ఆపరేటర్ ఒక్కరే ఉండి విధులు నిర్వహించాల్సి వస్తోంది. వాచ్‌మెన్లను ఫీల్డులో ఉపయోగించుకుంటున్నారు. స్కిల్డ్ పనులకు వాడుకుంటున్నా అన్ స్కిల్డ్ వేతనాలనే చెల్లిస్తున్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు పదేళ్లు నిండితే గతంలో వారికి ఇంక్రిమెంట్ ఇచ్చేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చాకా దాన్ని ఇవ్వడం లేదు. రిటైర్మెంట్ అయిన కాంట్రాక్టు విద్యుత్ కార్మికులకు ఎలాంటి బెనిఫిట్స్ అందడం లేదు. విధి నిర్వహణలో ఉండి ప్రమాదాలు చోటు చేసుకుంటే ఎలాంటి సదుపాయాలూ అందడం లేదు. మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం, వారి కుటుంబ సభ్యులకు పెన్షన్ ఇవ్వడం లేదు. ఇపిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్ సక్రమంగా అమలు చేయడం లేదు. అలాంటి కాంట్రాక్టర్లను పెట్టాలని అనేక రూపాల్లో ఆందోళనలు చేపట్టినా చర్యలు తీసుకోలేదు. తమను రెగ్యులర్ చేయాలని, సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఇప్పటికే పలు రూపాల్లో పలు దఫాలుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. 2018లో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నెల 30న జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీలు, సభలు నిర్వహించనున్నారు.



తక్షణమే రెగ్యులర్ చేయాలి

విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలి. ప్రమాదాలు జరిగితే ఆదుకునేందుకు అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీని అమలు చేయాలి. పిఆర్‌సి అరియర్స్ వెంటనే చెల్లించాలి. పదేళ్లు నిండిన వారికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. నూతన ఆపరేటర్లుగా చేరిన వారికి పాత ఆపరేటర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలి.



- కె.భీమేష్ చౌదరి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి.

బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ కాకూడదు

- ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీలో జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బోగస్ కుల ధ్రువకరణ పత్రాలు జారీ కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఆర్‌డిఒలు, తహశీల్దార్లు పరిశీలించిన తర్వాతనే ఇవ్వాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్లో ఎస్సీ ఎస్టీ జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషతో పాటు జిల్లా ఎస్‌పి బింధు మాధవ్, ఎంపీ బస్తిపాటీనాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారనిరోధక చట్టం కేసులు పెండింగ్ లో ఉంటే సంబంధించి పోలీస్, రెవెన్యూ శాఖలు పరిష్కరించేందుకు దృష్టి సారించాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులకు సిఎస్ఆర్ ద్వారా పనులను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త హాస్టళ్లు కెజిబివి గురుకుల పాఠశాలల కోసం కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. గూడూరు మండలంలోని బాలికల వసతి గృహంలో టాయిలెట్స్ సరిగ్గా లేవని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వసతి గృహాలలో సీట్ల సంఖ్య పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, బోగస్ క్యాస్ట్ సర్టిఫికెట్లు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ చిరంజీవి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, ఆర్‌డిఒలు శేషి రెడ్డి, రామలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రంగ లక్ష్మీదేవి, మానిటరింగ్ కమిటీ సభ్యులు చిటికెల సామ్యూల్, రాజశేఖర్, శాంతి కుమార్, నవీన్, రాజు, ఊట్ల రమేష్ బాబు, పాల్గొన్నారు.


ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

డబ్బులిస్తే ఏ భూమైనా కట్టబెడతారు

- సర్వే చేసి పాస్ పుస్తకాలు జారీ కూడా
- సర్వే రెవెన్యూ శాఖలో అవినీతి బాగోతం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అది ప్రభుత్వం భూమా లేదా ఏ భూమైనా సాగులో చూపుతూ పట్టా పాస్ పుస్తకాలు జారీ చేసేందుకు డబ్బులిస్తే చాలు అప్పనంగా కట్టబెడతారు. భూమి మీద ఉండి వాస్తవంగా సాగు చేసుకున్న రైతుకు మాత్రం సాగులో ఉన్నట్లుగాని, పాస్ పుస్తకాల మంజూరులో అలసత్వం చూపుతారు. ఇదే జిల్లాలోని రెవెన్యూ , సర్వే శాఖ వ్యవహార శైలి. ఓర్వకల్ మండలం నన్నూరు గ్రామంలో సర్వే నంబర్ 267లో 1.10 ఎకరం భూమిలో రంగన్న అనే రైతు సాగు చేసుకుంటూ వచ్చాడు. ఇప్పుడు అక్కడ ఉన్నటువంటి భూమిలో ఉన్న మరో రైతు రంగన్న భూమిలో తమ భూమి ఉందని అనేక రోజులుగా రెవెన్యూ సర్వే అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది .ఆ భూమిని సర్వే చేసి రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎవరు భూమిని వారికి చూపించడంలో రెవెన్యూ, సర్వే అధికారులు వైఫల్యం చెందారు. అదే గ్రామంలో రైతు రామలక్ష్మి దేవి సర్వే నంబర్ 1145, 1150లో గల మూడు ఎకరాల భూమిలో ఉన్నట్లు సర్వే చేశారు. కానీ ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం చూపుతున్నారు. ఇవన్నీ పైసలు ఇవ్వనందుకు రెవెన్యూ సర్వే అధికారులు సమస్యలను పరిష్కరించకుండా పక్కకు పెట్టారు. కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామం పరిధిలోగల 793లో గత ప్రభుత్వంలో కీలకంగా పలుకుబడి ఉన్న వారు భూమిని సాగు చేసుకున్నట్లు పట్టా పాస్ పుస్తకం పొందడమే కాకుండా ఆన్‌లైన్ కూడా చేయించుకున్నారు. ఇప్పుడు ఆ భూమి విలువ దాదాపుగా రూ.10 కోట్లకు పైగానే ఉంటుంది. ఇలాంటి వాటికి మాత్రం ముడుపులు పెద్ద ఎత్తున తీసుకొని భూములను రెవెన్యూ, సర్వేవిభాగాల ఏదనుకుంటే అది చేస్తున్నారు.


ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో సర్వే చేస్తున్న అధికారులు

ముడుపులిస్తేనే సర్వేకు : భూములను సర్వే చేసి వాటికి అనుభవం కింద ధ్రువీకరణ పత్రం ఇవ్వాలంటే సర్వే శాఖ అధికారులకు ముడుపులు ఇచ్చుకోవాల్సిందే. గ్రామస్థాయిలోని విలేజ్ సర్వేయర్ నుండి మండల డివిజనల్ స్థాయి సర్వేయర్లకు పెద్ద ఎత్తున ముడుపులు రైతులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి. ఒక్కో ఎకరం సర్వే గాని చేస్తే భూమి విలువను బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. రూ.10 వేల నుండి లక్షకు పైగానే ముడుపులిస్తేనే సర్వేకు వేస్తారు లేకపోతే అస్సలు పట్టించుకోరు.

భూమి విలువను ఆధారంగా వసూలు : రెవెన్యూ శాఖ తీరు అంతా ఇంతా కాదు. భూమి విలువను బట్టి పాస్ పుస్తకాల జారీకి పెద్ద ఎత్తున ముడుపులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. ఎకరం రూ.కోటికి పైగానే ఉంటే దాదాపుగా ఒక్క శాతం నుండి ఐదు శాతం వరకు రైతుల నుండి పాస్‌పుస్తకాలకు ఆన్‌లైన్‌కు వసూలు చేస్తున్నారు. క్షేత్రస్థాయి నుండి మండల స్థాయిలోని రెవెన్యూ అధికారులకు ముడుపులుగానే అందకపోతే ఆన్‌లైన్‌కు కానీ పాస్ పుస్తకాల మంజూరుకు ఈ శాఖ అధికారులు చర్యలు తీసుకోరు.

సఫాయి కర్మచారుల సంక్షేమానికి చర్యలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

సఫాయికర్మాచర్ల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష వెల్లడించారు. ప్రొహిబిషన్ ఆఫ్ మాన్యువల్ స్కావెంజర్స్ రిహాబిలిటేషన్ యాక్ట్ -2013 అమలుపై సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీలు ఆసుపత్రులు, రైల్వేలు, శానిటేషన్ ఎక్కువగా జరిగే ప్రదేశాలలో సఫాయి కర్మచారులు ఉంటారన్నారు.సర్వే చేసి జాబితా తయారు చేయాలని కలెక్టర్ సంధింత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జిల్లా ఎస్‌పి బింధు మాధవ్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పాల్గొన్నారు.

ఆర్‌యులో మొక్కలునాటిన విసి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



రాయలసీమ యూనివర్సిటీలో శుక్రవారం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మొక్కలు నాటి, పెంచే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్ పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు ప్రిన్సిపల్ హరి ప్రసాద్ రెడ్డి అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దొంగతనాలు అరికట్టండి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

మండలంలోని అనేక గ్రామాల్లో ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున దొంగతనాలు జరుగుతున్నాయని వెంటనే అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రామకృష్ణ, మండల కార్యదర్శి బి.నాగన్న ఎస్ఐని కోరారు. శుక్రవారం ఓర్వకల్ ఎస్ఐ సునీల్ కుమార్‌ను జి.రామకృష్ణ, కార్యదర్శి నాగన్న ,సిఐటియు మండల కార్యదర్శి ఎస్ షాజహాన్ కలిసి పలు సమస్యలను వివరించారు. మండలంలో రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన నిరంతరం పోరాడుతుటామని వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలన్నారు. ఎస్ఐని కలిసిన వారిలో దస్తగిరి, బషీర్, లింగేశ్వర్ మల్లికార్జున సంజీవలు ఉన్నారు

మండల ఆదాయం 15శాతం పెరగాలి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

మండలాల స్థూల ఉత్పత్తి 15శాతం పెంచడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఆదేశించారు. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య జిల్లాలోని అన్ని మండలాల స్పెషల్ ఆఫీసర్లు , ఎంపిడిఒలు , స్టాటిస్టికల్ అధికారులు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించారు. మండలాలను ఏ విధంగా అభివృద్ధి చేస్తే 15శాతం ఆదాయం ప్రతి సంవత్సరం పెరుగుతుంది , ఆ విధంగా పెరగటానికి ఏ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విధంగా ఐదు సంవత్సరాల కొరకు స్థూల ఉత్పత్తిని పెంచటానికి ఏ విధంగా కార్యాచరణ చేసుకోవాలన్నారు.

ఎన్‌డిఎ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో గత ఎన్నికలలో ఎన్ డిఏ కూటమి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా నెరవేర్చాలని సిపిఎం నాయకులు కోరారు. శుక్రవారం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో సిపిఎం నగర కమిటీ సభ్యులు ముఖ్య కార్యకర్తల సమావేశం సిహెచ్ సాయిబాబా అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు పి నిర్మల, నగర కార్యదర్శి టి రాముడు హాజరయ్యారు.. వారు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం 100 రోజుల పూర్తయిన సందర్భంగా ప్రజల్లోకి వెళ్ళి చేసిన గొప్పతనాన్ని వివరించాలని తెలుగుదేశం ప్రభుత్వం చెప్పడం పట్ల వారు అభ్యంతరం తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలలో కొన్ని మాత్రం అమలు చేసి మరికొన్నిటిని అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం బడ్జెట్ లేదని సాకుతో సంక్షేమ పథకాలను ప్రజలకు దూరం చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. 50 యేళ్లకే బీసీ ఎస్సీ ఎస్టీలకు పెన్షన్లు మహిళలకు నెలకు రూ 1500, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 15000 వేయడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు లాంటి పథకాలు మరిచారని తెలిపారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంలో చంద్రబాబు మెతక వైఖరి వహిస్తున్నాడని అన్నారు. కడపలో స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేయడంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఏమాత్రం కూడా ప్రశ్నించడం లేదన్నారు. కర్నూలు నుండి విజయవాడకు ఇంటర్ సిటీ రైలు నడపాలని ఇటీవల కర్నూలు మంత్రి టీజీ భరత్ కేంద్ర మంత్రిని కోరడం ఏమిటని నేరుగా కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కర్నూల్ నుండి విజయవాడకు ఇంటర్సిటీ రైలు నడపడానికి అనుమతి తీసుకుని రావాలని వారు సూచించారు. గతంలో సిపిఎం అనేక పోరాటాల ఫలితంగా కర్నూలు నుండి హైదరాబాదుకు ఇంటర్ సిటీ ట్రైన్ వేశారని ఇప్పుడు కూడా కర్నూలు నుండి విజయవాడకు ఇంటర్ సిటీ ట్రైన్ నడపాలని కోరారు. రాబోయే కాలంలో సిపిఎం పార్టీగా సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడం కోసం కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు,. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు కోసం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ నరసింహులు, కె సుధాకరప్ప, కె ప్రభాకర్, ఎస్.మహమ్మద్ రఫీ, ఎస్.ఉసేన్ బాష, ,మల్లికార్జున, రామకృష్ణ, జి ఏసు, వి.శంకర్, ఎంసి ఆనంద్, ఎం. దావీదు, ఎం.లక్ష్మయ్య, జె శ్రీనివాసులు, కె అరుణ, ఎస్. శ్యామలమ్మ, జె లక్ష్మీబాయి.ఎర్రమల తదితరులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి


కార్యదర్శి జయలక్ష్మి కి శుభాకాంక్షలు తెలుపుతున్న హమాలీలు

మార్కెట్ సమస్యలు పరిష్కరించండి

కార్యదర్శి జయలక్ష్మి కి అభినందనలు తెలిపిన హమాలి యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బారెడ్డి పూల బొకే తో శుభాకాంక్షలు తెలిపారు. హమాలి యూనియన్, మహిళ హమాలీలు, పలువురు కమిషన్‌దారులు, పూల బొకేలు, స్వీట్స్ తో అభినందించారు. అనంతరం మార్కెట్ లో పెండింగ్ లో ఉండే హమాలీలు సమస్యలను పరిస్కారం చేయాలని కోరారు. మహిళలకు లైసెన్సులు ఇవ్వాలని మహిళ హమాలీలు కోరారు. త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి ఆర్.జయలక్ష్మి హామీ ఇచ్చారు. మార్కెట్ లో ఉండే పెండింగ్ సమస్యలు అన్ని పరిస్కారం చేసేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కార్యదర్శి రెహమాన్ ,వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో అభివృద్ధి వైపు అడుగులు

కొంగనపాడు లో ప్రజా వేదిక గ్రామసభలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ : మొదటి 100 రోజుల్లోనే సంక్షోభంలోనూ సంక్షేమం సాధించి అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నామని, ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు చేత అనిపించుకుంటోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం కొంగనపాడులో ప్రజావేదిక గ్రామసభ నిర్వహించారు. గ్రామం లో ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వంఅనే స్టిక్కర్లను అతికించారు. గ్రామ సచివాలయం ఆవరణ లో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 16,437 పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సి ప్రకటించి నిరుద్యోగ యువతకు అండగా ఉన్నామన్నారు. పింఛను మొత్తాన్ని ఒకేసారి రూ 1000 పెంచి రూ 4వేలు చేయడంతో పాటు, ఎన్డీయే అధికారంలోకి వచ్చిన మొదటి నెలలో ఒక్కొక్కరికీ రూ 7 వేల చొప్పున అందజేశామన్నారు. స్థానిక సంస్థలకు రూ 1,452 కోట్లు ఇచ్చి పంచాయతీలకు ప్రాణం పోశామన్నారు. పేదలకు పూటకు రూ 5 లకే ఆకలి తీర్చే 100 అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించామన్నారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌరుచరిత



కర్నూలు సుందరయ్య సర్కిల్లో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన తగదు

సుందరయ్య సర్కిల్లో ఎస్‌ఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చేసే ఆలోచనలు వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్లో శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప అధ్యక్షతన నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్ మాట్లాడుతూ నిత్యం టిడిపి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఉన్న కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ సీట్లను తాము నిర్వహించలేమని ఎన్ఎంసికి లేఖ రాయడం ద్వారా రాష్ట్రంలో ఉన్న పేద ,మధ్యతరగతి విద్యార్థులు ఎంబిబిఎస్ చదువుకు దూరం అవుతారన్నారు. ఆదోని మెడికల్ కాలేజ్ పనులను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానం కాకుండా నేరుగా ప్రభుత్వమే నిర్మించి ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాని అన్నారు . రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణకు సంబంధించిన 107, 108 జీవోలను రద్దు చేయాలన్నారు. నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్నప్పుడు మా ప్రభుత్వం వచ్చాక సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు రద్దుచేసి అన్ని ప్రభుత్వమే నిర్వహిస్తుందని చెప్పిన హామీని అమలు చేయాలన్నారు. ఈ సంవత్సరం రాష్ట్రానికి రావాల్సిన 700 మెడికల్ సీట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎన్ఎంసికి లేఖ రాసి రాబట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయడం ద్వారా విద్యార్థులకు ఉచితంగా అందాల్సిన విద్య దూరం అవుతుందని, వెంటనే రాష్ట్రప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన విరమించుకోవాలన్నారు. అందరికీ వైద్య విద్య అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్యన్, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

కంది, సజ్జ సాగును పరిశీలించిన ఎఒ

ప్రజాశక్తి -సి బెళగల్



కంది, సజ్జ పంటలను ఏఓ మల్లేష్ కుమార్ శుక్రవారం పరిశీలన చేశారు. గొల్లలదొడ్డిలో ఆయా రైతులతో ఆయా పంటల తెగుళ్ల, దిగుబడి నుద్దేశించి అడిగితెలుసుకున్నారు. అధికారుల సలహాలు పాటించాలని,వ్యవసాయ సిబ్బంది కూడా రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఇకెవైసికి ఈ నెల 23 వరకు గడువు ఉందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విఏఏ శశికాంత్, ఎంపీఈఓ లు సునంద, వెంకటేశ్వర్లు , రైతులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం : ఐద్వా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


గోవిందమ్మను పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

మహిళలపై దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఐద్వా జిల్లా నాయకులు పిఎస్.సుజాత, జయమ్మ, రషీద విమర్శించారు. శుక్రవారం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కల్లుకుంట గ్రామంలో కొంతమంది గోవిందమ్మను ఇంటి నుంచి ఈడ్చుకెళ్లి విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టడం, వివస్త్రను చేయడం సిగ్గు చేటని విమర్శించారు. ప్రభుత్వాల వైఫల్యం వల్లే ఇలాంటి దారుణాలు చోటు చేసుకుంటున్నాయని మండిపడ్డారు. వీటిని అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గోవిందమ్మపై దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు పరోక్షంగా సహకరించిన, ప్రోత్సహించిన వారిని కూడా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే గోవిందమ్మ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వం మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. గోవిందమ్మ కుటుంబానికి న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ పాల్గొన్నారు.

గుంతలు కూడా పూడ్చలేని ప్రభుత్వం
- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని


గుంతలు పూడిపిస్తున్న రమేష్ యాదవ్

రోడ్డుకు పడిన గుంతలను గంపెడు మట్టితో పూడ్చలేని ధీనస్థితిలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఉందని కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆదోని శివారులో రోడ్డుకు పడిన గుంతలను ఆయన సొంత ఖర్చులతో మట్టితో పూడిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పాలకల నిర్లక్ష్యం వల్ల దుర్భరమైన రోడ్లు దర్శనమిస్తున్నాయని తెలిపారు. వాహనాలు అదుపుతప్పి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అన్నిచోట్లా రోడ్లు కోతకు గురై గుంతలు పడి దర్శనమిస్తున్నాయని తెలిపారు. ఇవి పాలకులకు కనపించడం లేదా అంటూ ప్రశ్నించారు. గత వైసిపి హయాంలో ఒక్క రోడ్డు కూడా వేసిన దాఖలాలు లేవని, కల్లబొల్లి మాటలతో పాలన చేపట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులయినా 'అదిగో.. ఇదిగో' అంటూ కాలం వెళ్లదీస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యే పార్థసారథి ప్రజల కష్టాలను, సమస్యలను పట్టించుకోవడం లేదని తెలిపారు. గురువారం 'అన్న క్యాంటీన్' ప్రారంభోత్సవంలో కూటమి నాయకుల వ్యవహారం ప్రజలకు తెలిసిందన్నారు. ప్రొటోకాల్ లేకుండా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరించారని మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరపున నిలబడి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, సాయినాథ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శ్రీనిత్ ఉన్నారు.

25న ఉచిత రక్తనాళాల వైద్య శిబిరం
- నిర్వాహకులు కాకుబళ్ నాగేష్

ప్రజాశక్తి - ఆదోని


గోడపత్రికను విడుదల చేస్తున్న సభ్యులు

రక్తనాళాల సమస్యలతో ఇబ్బందులు పడే వారి సౌకర్యార్థం ఈనెల 25న వైద్య పరీక్ష శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఎన్ఆర్ఐ కాకుబళ్ నాగేష్ తెలిపారు. శుక్రవారం ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), వామ్ ఆధ్వర్యంలో ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించే వైద్య పరీక్ష శిబిరం గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవయవాల లోపంతో ఇబ్బందులు పడే వారి సౌకర్యార్థం గుండె, కంటి పరీక్ష శిబిరాలను ఇంతకు ముందే నిర్వహించామని తెలిపారు. కొందరు రక్తనాళాల సమస్యతో బాధపడుతున్నామని తమ దృష్టికి తీసుకొచ్చారని, వారి కోసం ఈనెల 25న ఆదోని పూలబజార్ వాసవీ కల్యాణ మండపం (వేదిక దాతలు)లో శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అవోపా పట్టణ అధ్యక్షులు, భారత సేవా రత్న అవార్డు గ్రహీత వంకదారు శ్రీనాథ్ గుప్త మాట్లాడుతూ... వాస్కులర్ సర్జన్ కన్సల్టేషన్ అవసరమైన ప్రతి ఒక్కరికీ రూ.4500 విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి, వారి సమస్యలకు పరిష్కార మార్గాలు తెలుపుతారని అన్నారు. ఆదోని పట్టణ అవోపా కార్యదర్శి డైమండ్ రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు వెంకటేష్ బాబు, అంజి, విజయ్, రత్నయ్య, మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతాశ్రీ, గీత ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత
- వైద్య బృందం పరిశీలన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఇద్దరు బాలికలు అస్వస్థతకు గురి కాగా, శుక్రవారం మరో 8 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారు. తలనొప్పి, వికారం, తల తిరగడం, వాంతులు అయ్యే లక్షణాలతో విద్యార్థినులు రెండు రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు.

ఆదోనిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఇందు, భాగ్య గురువారం అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరు కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 24 గంటలు గడవక ముందే సింధు, శిరీష, మహాలక్ష్మి, రాజేశ్వరి, లేఖన, దీపిక, లక్ష్మి, నాగవేణి, వాచ్ ఉమెన్‌తో కలిపి 8 మంది అస్వస్థతకు గురయ్యారు. ఇంద్రనగర్ సమీపంలో ఉన్న బీసీ బాలికల కళాశాల హాస్టల్‌కు చెందిన విద్యార్థులని తెలిపారు. కళాశాల సిబ్బంది వెంటనే ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయంలో వైద్యులు బాలికలకు చికిత్సతో పాటు రక్త పరీక్షలు నిర్వహించామని, రిపోర్టులు వచ్చాక కారణాలు ఏమిటని చెప్పవచ్చని తెలిపారు. అస్వస్థతకు గురైన బాలికలను ఆదోని ప్రభుత్వాస్పత్రిలో ఆదోని తహశీల్దార్ శివరాముడు పరామర్శించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మాట్లాడుతూ... హాస్టల్‌లో 130 మందికి పైగా ఉన్నామని, 14 స్నానపు, మురుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. రేకుల షెడ్డులో ఉండడం వల్ల, స్నానం కోసం తెల్లవారు జామునే నిద్ర మేల్కోవడం వల్ల అస్వస్థతకు గురవుతున్నామని వాపోయారు. తాగునీరు కలుషితమై ఉన్నాయని, ఆ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. హాస్టల్ ఊరు చివరన ఉండడంతో కళాశాలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోజూ కళాశాలకు రానుపోను సుమారు 5 కిలోమీటర్లు నడవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వాపోయారు.


సమస్యలు చెబుతున్న విద్యార్థినులు

ఉక్కపోతతో ఇబ్బందులు

బాలికలు రేకుల షెడ్డులోనే చదువుకోవడం, తినడం, పండుకోవడం చేస్తున్నారు. లోపలనే మురుగు కాలువ ఉండడం వల్ల దోమలు దండయాత్ర చేస్తున్నాయి. సుమారు 130 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కఫ్యాన్ కూడా లేదు. ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని వార్డెన్‌ను కోరితే తల్లిదండ్రుల సమావేశంలో ఫ్యాన్లకు సహకరించాలని కోరుతున్నారని విద్యార్థినులు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న తాము ఎక్కడి నుంచి ఫ్యాన్లు ఇప్పించేదని తల్లిదండ్రులు వాపోతున్నట్లు తెలిపారు. అసలే వేడి కారణంగా పగలు, రాత్రి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని విద్యార్థులు వాపోయారు.


రేకుల షెడ్డులో కొనసాగుతున్న హాస్టల్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని


హాస్టల్‌ను సందర్శించిన వైద్య బృందం

రెండు రోజులుగా విద్యార్థినులు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ అస్వస్థతకు గురవుతున్నారు. కారణాలు తెలుసుకునేందుకు కొత్త బస్టాండ్ రోడ్డులోనే విద్యార్థులు విడిది పొందుతున్న హాస్టల్‌ను ప్రభుత్వాస్పత్రి అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ నాయక్, వైద్య బృందం హాస్టల్‌ను సందర్శించారు. అక్కడ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒకే చోటనే మురుగుదొడ్లు, స్నానపు గదులు, అక్కడే భోజనం చేస్తున్నామని విద్యార్థినులు వాపోయారు. విద్యార్థుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. వైద్య బృందంలో డాక్టర్ జగదీష్, మధు, అనిల్ ఉన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం
- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 25వ వార్డు సాయి గణేష్ కాలనీ, 33వ వార్డు, 16వ వార్డు సున్నంబట్టి దగ్గర, 14వ వార్డు గూడూరు బైపాస్ రోడ్డు, 23వ వార్డు బుడగ జంగాల ఏరియా, 5వ వార్డు శివనగర్ కాలనీ ప్రాంతాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు ఎమ్మెల్యే బీవీ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.1.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అన్ని వార్డులను అభివృద్ధి చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. త్వరలోనే పట్టణ ప్రజలకు మూడు పూటలా తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అన్ని వార్డుల్లోనూ ప్రధాన రహదారుల్లో పరిశుభ్రత లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డిఇ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.


సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమి పూజ చేస్తున్న బీవీ

పేదల ఆకలి తీర్చేందుకే 'అన్న క్యాంటీన్లు'
- మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పేదల ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్, శ్రీనివాస థియేటర్ ఎదురుగా రెండు అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల కడుపు కొట్టిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పునఃప్రారంభించినట్లు తెలిపారు. పేదలు వివిధ పనుల మీద పట్టణానికి వస్తుంటారని, వారికి రూ.5లకే అల్పాహారం, భోజనం అందించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమని తెలిపారు. ప్రజలందరూ అన్న క్యాంటీన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డిఇ మనోహర్ రెడ్డి, నీరజ, టిడిపి నాయకులు, కౌన్సిలర్లు రామదాసు గౌడ్, కొండయ్య చౌదరి, రంగస్వామి గౌడ్, రామకృష్ణ నాయుడు, బందే నవాజ్, తురేగల్ నజీర్ అహ్మద్, జనసేన నాయకులు నవీన్ కుమార్ పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

పోలీసులా.. మజాకా..!

- రైతు నుంచి రూ.26 వేలు దొంగలించిన వైనం
- పోలీసు స్టేషన్‌లో నమోదు కాని కేసు
- స్టేషన్ చుట్టూ రైతు ప్రదక్షిణలు

ప్రజాశక్తి - ఆలూరు

అన్నదాతను పోలీసులు భయభ్రాంతులకు గురి చేసి రూ.26 వేలు దొంగలించిన సంఘటన ఆలూరు మండలం హులేబీడు గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఈనెల 17న రాత్రి సంఘటన జరిగినా ఇప్పటివరకు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు. న్యాయం చేయాలని బాధిత రైతు మూడురోజులుగా పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్న పట్టించుకొనే నాథుడే కరువయ్యారు.

ఆలూరు మండలం మనేకుర్తి గ్రామానికి చెందిన నడిపి అంజినయ్య అలియాస్ కిల్లప్ప ఈనెల 17న రాత్రి 7.15 గంటలకు ఆలూరు పట్టణ సమీపంలో పెట్రోల్ బంకుకు వెళ్లారు. తన ట్రాక్టర్‌కు డీజిల్ క్యాన్‌ను నింపుకొని తిరిగి బయల్దేరారు. హులేబీడు గ్రామ సమీపంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి రైతు బైక్‌ను ఆపారు. 'గంజాయి అమ్ముతున్నావంట కదరా' అని అడగారు. 'నేను రైతును' అని చెప్పినా వినకుండా బైక్‌ను చెక్ చేసి 'జేబులో ముందిరా. తీయమ'ని గద్దించారు. 'డబ్బులు ఉన్నాయి సార్' అంటూ రెండు రూ.50 వేల కట్టలను వారికి చూపించారు. పోలీసులు రబ్బరు బ్యాండ్ తీసి డబ్బులను లెక్కిస్తుండగా రబ్బరు బ్యాండ్ కింద పడిపోయింది. రైతు వంగి అందించగా డబ్బులను మడత పెట్టి రబ్బరు బ్యాండ్ వేసి ఇచ్చారు. ఇంటికి వెళ్లి ఇతరులకు అప్పు చెల్లించాలని వారికి ఇస్తుండగా అందులో రూ.26 వేలు తక్కువ వచ్చాయి. డబ్బులు ఎక్కడ పోయాయని ఆలోచించగా పోలీసులు డబ్బును కాజేశారని రైతుకు తెలిసింది. రబ్బరు బ్యాండ్ కోసం తాను కిందికి వంగిన సమయంలో రెండు డబ్బుల కట్టల నుంచి రూ.26 వేలు దొంగలించారని బాధిత రైతు వాపోయారు.

ఎఎస్ఐ చంద్రశేఖర్‌పై వేటు..?

జరిగిన సంఘటన చెప్పేందుకు బాధిత రైతు నడిపి అంజినయ్య మంగళవారం రాత్రి స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసి వెళ్లారు. ఆ సమయంలో ఎఎస్ఐ లేరు. బాధిత రైతు నుంచి కేసు తీసుకోవడానికి ఎఎస్ఐ చంద్రశేఖర్ అందుబాటులో లేరనే కారణంతో ఆయనపై వేటు వేసినట్లు తెలిసింది.

నవోదయ ఫలితాల్లో 'విక్టరీ' అగ్రగామి
- విక్టరీ నవోదయ అకాడమీ డైరెక్టర్ చాంద్ బాషా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



నవోదయ ఫలితాల్లో రాష్ట్రంలోనే విక్టరీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ అగ్రగామిగా నిలుస్తోందని విక్టరీ నవోదయ అకాడమీ డైరెక్టర్ డి.చాంద్ బాష తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని గీతా మందిర్ దగ్గర 20 ఏళ్లుగా, ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనూ, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లు సాధించి తన విక్టరీ పేరులోనే విజయాన్ని అందిస్తోందని తెలిపారు. 2019వ సంవత్సరంలో 39 సీట్లతో, 2020లో 46 సీట్లు, 2021లో 33 సీట్లు, 2022లో 42 సీట్లు, 2023లో 53 సీట్లు, 2024వ సంవత్సరంలో 37 సీట్లతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. చక్కటి విద్య బోధన, విద్యార్థుల్లో నిత్యం నైపుణ్యం పెంపొందించడం, చక్కటి వాతావరణంలో శిక్షణ కార్యక్రమం, చక్కటి హాస్టల్ సౌకర్యం ఉందని తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ప్రతి రైతూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎఒ శేషాద్రి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పంటల నమోదు చేపట్టినట్లు తెలిపారు. వాటికి సంబంధించిన ఈకేవైసీ అనే ప్రక్రియ ఇక రెండు రోజుల్లో ముగుస్తుందని చెప్పారు. రైతులందరూ రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 23న ఈక్రాప్ బుకింగ్, ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కావస్తోందని తెలిపారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహమూ ఎంతో కీలకం
- కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతి విద్యార్థి కూడా చదువులో రాణించాలంటే గురువులతోపాటు వారి తల్లిదండ్రుల ప్రోత్సాహమూ ఎంతో అవసరమని కళాశాల ప్రిన్సిపల్ పి.వరదరాజులు తెలిపారు. శుక్రవారం చిప్పగిరి కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు పూలమాల, శాలువా వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే పట్టుదల, కసితో బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవ్వడానికి ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు ఎలా చదువుతున్నారు లేదా సక్రమంగా కళాశాలకు వెళ్తున్నారా లేదా అని తెలుసుకోవాలన్నారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులు తల్లిదండ్రులను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో స్రవంతి (24) ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు... నందవరం గ్రామానికి చెందిన కురువ బీరప్ప కుమార్తె స్రవంతిని కోసిగి మండలం సజ్జలగూడేనికి చెందిన కె.రామకృష్ణకు ఇచ్చి ఐదేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. స్రవంతి మానసిక స్థితి బాగోలేకపోవడంతో ప్రస్తుతం పుట్టిల్లు నందవరంలో ఉంటున్నారు. తల్లిదండ్రులు ఆమెకు వైద్యుల దగ్గర చికిత్స చేయిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి మెరుగు పడకపోవడంతో ఆమె మనస్థాపం చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్రవంతి తండ్రి బీరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - నందవరం

మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నందవరం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన కుమ్మరి చంద్ర మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఈనెల 17న పురుగు మందు తాగారు. ఇంట్లో పడి ఉన్న చంద్రను గమనించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోలుకోలేక ఈనెల 20న మృతి చెందారు. మృతుని భార్య కుమ్మరి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెద్దహోతూరులో ఇరువర్గాల ఘర్షణ
- నలుగురికి గాయాలు...

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలో నలుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... పాత ఘర్షణల నేపథ్యంలో ఎస్సీలు, బోయ సామాజిక వర్గానికి చెందిన వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఆటో రాముడు, రామాంజి, వీరేష్, హరికి గాయాలయ్యాయి. వీరిని ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

వంద రోజుల్లోనే ప్రజా సంక్షేమ పాలన
- గ్రామసభల్లో టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన అందించిందని మండల టిడిపి సీనియర్ నాయకులు సిఎస్.సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఓర్వకల్ మండలంలోని పాలకొలను గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మూడు నెలల్లో గానే అనేక చర్యలు తీసుకుందన్నారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేపడుతుందన్నారు. సర్పంచి సి.సుజాతమ్మ పాల్గొన్నారు.

హొలహర్వి : ఎన్‌డిఎ కూటమి వందరోజుల పాలనపై గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆలూరు టిడిపి ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్ పాల్గొన్నారు. ముందుగా ఎంపిడిఒ కార్యాలయం ముందు మొక్కలు నాటారు. అనంతరం వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి పాల్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు బసవరాజు, సర్పంచి మల్లికార్జున, నాయకులు అసుండీ శ్రీధర్ పాల్గొన్నారు.

మంత్రాలయం : ప్రజలకు సుపరిపాలన అందించటంలో చంద్రబాబును మించిన నేత లేరని టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెట్నిహళ్లిలో 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా నాయకుడు చేపల నాగేష్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ మనిమంజరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి వంద రోజుల పాలనలో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ 6 సంక్షేమ పథకాలు అమలు చేయడం మొదలు పెట్టారని తెలిపారు. విడుదల వారిగా హామీలు నెరవేర్చుతారన్నారు. ఇప్పటికే పెన్షన్లు పెంచి ఇచ్చారన్నారు ప్రతిపక్ష హోదా లేని వైసిపి వంద రోజుల్లో వంద రకాలుగా కూటమి ప్రభుత్వంపై విష ప్రచారాలు చేస్తుందని విమర్శించారు. మాలపల్లి మాజీ సర్పంచి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, సింగరాజుపల్లి మాజీ సర్పంచి గోపాల్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బిజెపి మండల ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు రాఘవేంద్ర కులకర్ణి, పట్టణ ఇంచార్జీ బి వరదరాజులు, నాయకులు అశోక్ రెడ్డి, ఎఒ జీరా గణేష్, ఎస్సై పరమేష్ నాయక్, ఇఒపిఆర్డి ప్రభావతి సచివాలయ కార్యదర్శి లక్ష్మి, జనసేన నాయకులు బిబిసి చిన్న, సీనియర్ నాయకులు మేకల మల్లేష్, పెద్ద లక్ష్మయ్య పాల్గొన్నారు.



పాలకొల్లును గ్రామంలో పాల్గొన్న సిఎస్.సుధాకర్ రెడ్డి


హొలహర్విలో


మంత్రాలయం మండలంలో...

'అమ్మ పేరుతో' ఒక మొక్క
- టిడిపి నాయకులు రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి మంత్రాలయం

'అమ్మ కోసం.. అమ్మ పేరుతో' ప్రతి ఒక్కరూ మొక్క నాటాలని టిడిపి నాయకులు, మాధవరం మాజీ సర్పంచి ఎస్.రఘునాథ్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'అమ్మ కోసం మొక్క' అనే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గ్రామ కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్క చెట్టు అయ్యేంత వరకు సంరక్షించుకోవాలని కోరారు. మహబూబ్ బాషా, కేశవయ్య, ఉరుకుంద, వెంకటేష్, జమీర్ పాల్గొన్నారు.

కోసిగి : మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోసిగి మేజర్ పంచాయతీ సర్పంచి అయ్యమ్మ తెలిపారు. కోసిగి పంచాయతీ కార్యాలయంలో మొక్కలు నాటారు. సర్పంచి అయ్యమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం చేపట్టారు. మొక్కలను పెంచి గ్రామంలో పచ్చదనం పెంపొందించాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సి న బాధ్యత అందరి పైనా ఉందన్నారు. వర్షాకాలం కావడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జూనియర్ అసిస్టెంట్ రంగస్వామి, ఎస్.రాజేష్ పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలం నేమకల్లు గ్రామంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఇఒఆర్డి బాలన్న, డిజిటల్ అసిస్టెంట్ దినేష్, సర్వేయర్ వినోద్ కుమార్, మహిళా సంరక్షకులు పావని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు. **దేవనకొండ** మండలం తెర్నేకల్ గ్రామంలో స్వచ్ఛతాహి సేవాలో భాగంగా చెత్త సంపద షెడ్ దగ్గర మొక్కలు నాటారు. సర్పంచి అరుణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాముడు పాల్గొన్నారు.


మంత్రాలయం : మొక్కలు నాటుతున్న నాయకులు


చిప్పగిరిలో మొక్కలు నాటుతున్న బాలన్న


కోసిగిలో...


దేవనకొండలో...

వివాహ వేడుకలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎమ్మిగనూరు పట్టణంలోని అజంతా ఫంక్షన్ హాలులో జరిగిన వివాహ వేడుకలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొని వరుడికి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే వాహన డ్రైవర్ వలీ కుమార్తె రిసెప్షన్‌కు హాజరైన ఆయన ముస్లింల సాంప్రదాయం ప్రకారం శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి మండల అధ్యక్షులు భీమిరెడ్డి, వైసిపి కోసిగి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి, నాయకులు ఐరన్ గల్లు శ్రీనివాస్ రెడ్డి, బుజ్జి స్వామి, దేశాయి ప్రహ్లాద చారి, ఎమ్మెల్యే పిఎ వెంకట్రామిరెడ్డి, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.


వరునికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - కౌతాళం


బహుమతులు అందిస్తున్న నాయకులు

మండలంలోని ఎరిగేరి ఉన్నత పాఠశాలలో ఈనెల 18, 19, 20న నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-14, అండర్-17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, పాఠశాల కమిటీ ఛైర్మన్ శ్రీరాములు, నాయకులు రామలింగ, బసవరాజు మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఆటలను భాగం చేసుకోవాలన్నారు. ఆటల నుంచి విద్యార్థులు క్రమశిక్షణ నేర్చుకోవాలని తెలిపారు. వెనుకబడిన ఎరిగేరి లాంటి ప్రాంతాల్లో మండల స్థాయి క్రీడలు నిర్వహించడం గొప్ప విషయమని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు రామన్న, నరసింహ రాజు, నరసింహులు, ఓబన్న, ఈరన్న, రాము, శేషు, విజయ కుమారి, ఈరన్న, చామంతి, యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధితులకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



నిత్యావసర సరుకులు, బట్టలు అందిస్తున్న ఆల్ఫ్రెడ్ రాజు

నియోజకవర్గ ప్రజలు సహాయం చేసిన నిత్యావసర సరుకులను, బట్టలను, వివిధ సామగ్రిని విజయవాడ వరద బాధితులకు అందించారు. మల్లెల గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు ఆధ్వర్యంలో గ్రూప్ సభ్యులు శుక్రవారం బాధితులకు సరుకులను అందజేశారు. మల్లెల గ్రూప్ సభ్యులు సంజు, బాలు, సామ్యేల్, సతీష్, శంకర్, హనుమంతు, అరుణ్, రంజిత్ రెడ్డి, పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు నరసన్న, జడ ప్రసాదరావు, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు కులుమాలలో 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 20 నుంచి 26 వరకు చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ శుక్రవారం నుంచి ప్రారంభించినట్లు ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని కులుమాల గ్రామంలో నిర్వహించనున్నామని చెప్పారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి పాల్గొంటారని తెలిపారు. గ్రామస్తులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.